# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 03-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **కేంద్ర ప్రభుత్వం సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో ముందుకు వెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**

**2.** **నిత్యావసర సరకుల ధరలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3.** **ఆంధ్రప్రదేశ్ లో ప్రజారవాణా వ్యవస్థ ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు.**

**4.** **తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో 3 వేల 35 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.**

**5.** **ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు ఎస్.వి.రంగారావు జయంతి ఈరోజు.**

==========================

కేంద్ర ప్రభుత్వం సబ్ కా సాత్ సబ్ కా వికాస్ నినాదంతో ముందుకు వెళ్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. నిన్న లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల్లో సుస్థిరతకు, నిలకడైన ప్రగతికి అనుకూలంగా ప్రజలు తీర్పు నిచ్చారని, తమ ప్రభుత్వం మూడవ విడత పదవి కాలంలో త్రిగుణికృత శక్తితోను, వేగంతోను పని చేసి ఫలితాలు సాధిస్తామని చెప్పారు. ప్రపంచం మొత్తం భారత్ వైపే చూస్తోందన్నారు. వికసిత్ భారత్ దిశగా అడుగులు వేస్తున్నామని, ఇందుకోసం ప్రజల భాగస్వామ్యం తీసుకుంటామని అన్నారు. భారత్ ప్రధమ్ నినాదాన్ని మరింత ముందుకు తీసుకువెళ్తామని ప్రధానమంత్రి పేర్కొన్నారు. నీట్ పరీక్ష అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

మరోవైపు రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ నిన్న సాయంత్రం సమాధానం ఇవ్వగా అది ఆమోదం పొందినట్లు సభాపతి ఓంబిర్లా ప్రకటించారు. అనంతరం లోక్ సభ నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు ఓం బిర్లా తెలిపారు.

--------------------------

నిత్యావసర సరకుల ధరలను తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. నిన్న వెలగపూడి సచివాలయంలో ఇసుక, రహదారులు,

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై సంబంధిత మంత్రులు, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యవసర వస్తువుల ధరల నియంత్రణకు ఆయా సరుకుల దిగుమతుల కోసం అవసరమైన చోట కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతామని అన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించి సాంకేతికంగా అందుబాటులోకి వచ్చిన కొత్త విధానాలపై అధ్యయనం చేయాలని దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నప్పటికీ వెంటనే మరమ్మతులు చేయాల్సిన రోడ్లపై ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యతపై నివేదికలను రూపొందించి నిర్మాణ రంగానికి అవసరమైన ఇసుకను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారవాణా వ్యవస్థ ఆర్టీసీని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖా మంత్రి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. నిన్న విశాఖపట్నంలోని మద్దిలపాలెంలో నూతన బస్సులను స్థానిక శాసనసభ్యులు వి.రామకృష్ణతో కలసి మంత్రి ప్రారంభించారు. అనంతరం ప్రతిభ కనబరచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ,

..వాయిస్..

---------------------------

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ–టిజిఆర్టీసీలో 3 వేల 35 ఉద్యోగాలను త్వరలో భర్తీ చేయనున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆయన నిన్న హైదరాబాద్‌లో పాత్రికేయులతో మాట్లాడుతూ, ప్రజా రవాణా వ్యవస్థకు పెద్ద పీట వేస్తూ తమ ప్రభుత్వం ఆర్టీసీలో ఉద్యోగాలను భర్తీ చేయాలని నిర్ణయించిందన్నారు. ఈ ఉద్యోగాలలో 2 వేల ఉద్యోగాలు డ్రైవర్, 743 శ్రామిక్ ఉద్యోగాలు ఉన్నాయని తెలిపారు. కొత్త ఉద్యోగులతో తెలంగాణ ఆర్టీసీని మరింత బలోపేతం చేస్తామని మంత్రి పేర్కొన్నారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను సంస్థ కొనుగోలు చేస్తోందని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు ఎస్.వి.రంగారావు జయంతి ఈరోజు. 1918 జూలై 3వ తేదీన కృష్ణాజిల్లా నూజివీడులో జన్మించిన ఆయన పూర్తి పేరు సామర్ల వెంకట రంగారావు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 3 వందలకు పైగా చలనచిత్రాల్లో నటించిన ఆయన రావణుడు, హిరణ్యకశపుడు, ఘటోత్కచుడు, కంసుడు లాంటి ప్రతినాయక పాత్రల్లోనే కాక అనేక సహాయ పాత్రల్లో తనదైన ముద్ర వేశారు. నర్తనశాలలో ఆయన నటనకు భారత రాష్ట్రపతి పురస్కారమే కాక.. జకార్తాలో జరిగిన ఆఫ్రో యేషియన్ చలనచిత్రోత్సవ పురస్కారం కూడా లభించింది. 1974 జూలై 18వ తేదీన ఆయన తుదిశ్వాస విడిచారు. ఎస్.వి.ఆర్ జయంతి సందర్భంగా ఆయన మాటలను ఒకసారి గుర్తుచేసుకుందాం....

..వాయిస్ ... 30 సెకన్లు

---------------------------

సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నివారణపై ప్రభుత్వంతో పాటు తెలుగు చలనచిత్ర పరిశ్రమ అవగాహన కల్పించాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టీజీ న్యాబ్, సైబర్ భద్రతా వాహనాలను ముఖ్యమంత్రి నిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా

ఆయన మాట్లాడుతూ. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణలో సమాజాన్ని కాపాడటానికి సహకరించాల్సిన బాధ్యత సినీ పరిశ్రమపై కూడా ఉందన్నారు. ఇక నుంచి ఎవరైనా కొత్త సినిమా విడుదలవుతున్న సందర్భంగా మాదకద్రవ్యాల నియంత్రణకు కృషి చేస్తూ ఒక దృశ్య సందేశాన్ని విడుదల చేయాలని, సినిమ థియేటర్స్‌లో కచ్చితంగా ప్రదర్శించాలన్నారు. అలా ప్రదర్శించిన థియేటర్స్‌కే భవిష్యత్తులో అనుమతులు జారీ చేస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

---------------------------

బ్రిటిష్ వలస పాలన నాటి చట్టాలను ప్రక్షాళన చేస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మూడు నూతన నేర, న్యాయ చట్టాలు జూలై 1వ తేదీ నుండి దేశ వ్యాప్తంగా అమలులోకి వచ్చాయి. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియం అనే ఈ మూడు నూతన చట్టాలు దేశంలోని క్రిమినల్ న్యాయ వ్యవస్థకు అత్యంత కీలకమని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. కాగా.. నూతన నేర చట్టాలపై ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన 'భారతీయ సాక్షా అధినియం' ప్రత్యేక కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంల మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ గాలులు వీస్తున్నాయని వీటి ప్రభావంతో రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని పేర్కొంది. తెలంగాణలో నిన్న పలు జిల్లాల్లో ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా మంచిర్యాల జిల్లా కాశీపేట మండలం కొండాపూర్‌లో 5.2, నర్సాపూర్‌లో 4.7, పాత మంచిర్యాలలో 3.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో ఈ రోజు, రేపు అక్కడక్కడ తేలికపాటి వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

======================